సాక్షి మహబూబ్‌నగర్

గురువారం । 7 । సెప్టెంబర్ । 2023



బుసలుకొడుతున్న గంజాయి

విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని గంజాయి పాలమూరుకు చేరుతోంది.

వివరాలు 8లో ▸



పది యూనిట్లలో విద్యుత్..

జూరాలకు ఎగువ నుంచి వరద వస్తుండటంతో విద్యుదుత్పత్తి చేపడుతున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం 28.3 /22.3

వాతావరణం

ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు వినియోగదారుల ఫోరం సమావేశం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జడ్చర్ల డివిజన్ పరిధిలోని రాజాపూర్ సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో శనివారం విద్యుత్ వినియోగదారుల ఫోరం సమావేశం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఎస్ఈ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోరం చైర్మన్ దిలీప్ కుమార్ ఫిర్యాదులు స్వీకరిస్తారని, వినియోగదారులు తమ దీర్ఘకాలిక సమస్యలను నేరుగా ఫోరం దృష్టికి తీసుకురావచ్చన్నారు. అలాగే విద్యుత్ చౌర్యం, ప్రమాదాలకు సంబంధించిన ఫిర్యాదులు తీసుకోరని చెప్పారు.

ఉత్సవ సమితిలో పేర్లు నమోదు చేసుకోండి



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వినాయకులను ప్రతిష్ఠించనున్న మంటపాల వారు సంఘం పేర్లను శ్రీగణేష్ ఉత్సవ సమితిలో నమోదు చేసుకొని గుర్తింపు ధ్రువపత్రం తీసుకోవాలని సమితి ప్రధాన కార్యదర్శి బాలయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలో ఈ నెల 18న వినాయకులను ప్రతిష్ఠించి తొమ్మిదిరోజులపాటు ఘనంగా పూజలు నిర్వహించి 27న నిమజ్జనం చేయాలని కోరారు. ఉత్సవ సమితిలో పేర్లు నమోదు చేసుకున్న సంఘాలకు గుర్తింపు పత్రం, కాషాయ జెండాలు, టోపీలు అందజేస్తామన్నారు. అంతకుముందు వినాయకుడి చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో సభ్యులు గోపాల్‌యాదవ్, కృష్ణమోహన్, పాండురంగం, మాల్యాద్రిరెడ్డి, శంకర్, హన్మంతు, లక్ష్మీనారాయణ, చంద్రయ్య, సుబ్రమణ్యం, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వం



మహబూబ్‌నగర్ న్యూటౌన్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తుందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం 5,089 పోస్టులతో వేసిన డీఎస్సీని రద్దు చేసి గత అసెంబ్లీలో ప్రకటించిన 13,089 పోస్టులు, ఉపాధ్యాయుల సర్దుబాటు అనంతరం మిగిలిన 9 వేల ఉపాధ్యాయ పోస్టులను కలిపి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేయాలని డిమాండ్ చేశారు. తక్కువ పోస్టులతో డీఎస్సీ వేసి రాష్ట్రంలోని విద్యార్థి, నిరుద్యోగులను మోసం చేయాలనుకోవడం మూర్ఖత్వమే అన్నారు. ప్రజాస్వామికవాదులను కలుపుకొని కేసీఆర్ ప్రభుత్వ నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తూ బీఆర్ఎస్ పతనానికి శ్రీకారం చుడతామన్నారు. దగా డీఎస్సీని రద్దు చేసి మెగా డీఎస్సీని వేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మారుతి, ప్రధాన కార్యదర్శి సీతారాం, నాయకులు సంజీవ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతనంగా శ్రీరామకొండ క్షేత్రం

- పేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి




కోయిల్‌కొండ: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీరామకొండ క్షేత్రాన్ని రూ.10 కోట్లతో అధునాతనంగా నిర్మించడం జరుగుతుందని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కోయిలకొండలో శ్రీరామకొండ ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆలయాలను పట్టించుకునేవారు కాదని, ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు రాజేంద్రప్రసాద్‌గౌడ్, ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి, అర్చకులు రఘురామాచారి, రాఘవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాలమూరుకు కృష్ణమ్మ

16న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం

- నార్లాపూర్ వద్ద నీటి పంపింగ్‌ను ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- మొదటి మోటారుతో ఎత్తిపోతలకు శ్రీకారం
- ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు ప్రయోజనం
- 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యం
- ఇదే అస్త్రంతో ఎన్నికలకు సన్నద్ధమవుతున్న అధికార పార్టీ




కొల్లాపూర్ మండలం నార్లాపూర్ వద్ద ఎత్తిపోతల పంప్‌హౌస్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ కింద నీటి ఎత్తిపోతలకు రంగం సిద్ధమైంది. శ్రీశైలం బ్యాక్‌వాటర్ ఆధారంగా నార్లాపూర్ వద్ద నీటిని తోడే విధంగా స్టేజ్-1 పంప్ హౌస్‌తో పాటు నీటిని నిల్వ చేసేలా 6.4 టీఎంసీల సామర్థ్యంతో అంజనగిరి రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కాగా.. మొదటి మోటారు పంప్ ద్వారా నీటిని ఎత్తిపోసి ప్రాజెక్ట్‌ను ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైంది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 16న ఆయన చేతుల మీదుగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి అధికార యంత్రాంగం సన్నాహాలు ప్రారంభించింది. ఇప్పటికే ప్రాజెక్ట్ కింద మొదటి మోటారును సిద్ధం చేసిన అధికారులు ఈ నెల 3న డ్రైరన్ నిర్వహించారు. మొదటగా ఒక మోటారు పంప్ ద్వారా నీటి విడుదల ప్రారంభించి, తర్వాత విడతల వారీగా ఆయకట్టుకు నీరందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో రానున్న ఎన్నికల్లో అధికార పార్టీ బీఆర్ఎస్‌కు 'పాలమూరు' ప్రాజెక్ట్ ప్రధాన ప్రచార అస్త్రం కానున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దక్షిణ తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు తాగు, సాగునీటిని అందించే లక్ష్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మొదటి పంప్‌తో ఎత్తిపోతలు..

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ కింద మొదటగా ఒక పంపుతో నీటిని ఎత్తిపోసేలా అధికారులు సర్వం సిద్ధం చేశారు. ప్రాజెక్ట్ స్టేజ్-1లో భాగమైన నార్లాపూర్ పంప్‌హౌస్ వద్ద 145 మెగావాట్ల సామర్థ్యం గల పంప్‌ను ఇప్పటికే సిద్ధం చేయగా, ఈ నెల మూడో తేదీన అధికారులు డ్రైరన్ నిర్వహించారు. ఈ ప్రక్రియ సక్సెస్ కావడంతో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా మొదటి మోటారు ద్వారా నీటి ఎత్తిపోతలను ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం 8.51 టీఎంసీల సామర్థ్యం ఉన్న నార్లాపూర్ రిజర్వాయర్‌ను నింపనున్నారు. ఆ తర్వాత స్టేజ్-1తో పాటు స్టేజ్-2, 3, 4 పంప్ హౌస్‌లలో మొదటి, రెండో మోటార్‌ను సిద్ధం చేసి ఏదుల, వట్టెం, ఉదండాపూర్ రిజర్వాయర్లను నింపేలా అధికారులు ముందుకు సాగుతున్నారు. నార్లాపూర్‌లో మొత్తం తొమ్మిది మోటార్లను ఏర్పాటు చేయనుండగా.. ఎనిమిది మాత్రమే నీటి పంపింగ్‌కు వినియోగించనున్నారు. వీటిలో ఏదైనా మోటార్ సాంకేతిక సమస్యలతో మరమ్మతులకు వచ్చినా.. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఒక మోటార్ ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేస్తున్నారు. సాగునీటి రంగంలో ఇప్పటివరకు కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో 139 మెగావాట్ల సామర్థ్యం గల భారీ మోటార్ల (బాహుబలి)ను వినియోగించగా.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో అంతకుమించి 145 మెగావాట్ల సామర్థ్యమున్న మోటార్లతో నీటిని ఎత్తిపోయనుండడం విశేషం.



అంజనగిరి (నార్లాపూర్) రిజర్వాయర్

అడ్డంకులను అధిగమించి..

కృష్ణానదిలో శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆధారంగా రోజుకు 1.5 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 90 టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు ప్రభుత్వం రూపకల్పన చేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలోని 70 మండలాల్లో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, 1,226 గ్రామాలకు తాగునీటితో పాటు పరిశ్రమలకు సైతం నీరందించాలనే లక్ష్యంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. 2016లో భూత్పూర్ మండలం కరివెన వద్ద సీఎం కేసీఆర్ ప్రాజెక్ట్ రిజర్వాయర్ పనులను ప్రారంభించారు. మొదటి నుంచి పర్యావరణ, ఇతర అనుమతుల పేరుతో ప్రాజెక్ట్ నిర్మాణానికి అడుగడుగునా అడ్డంకులు ఎదురయ్యాయి. ప్రారంభంలో రూ.35,200 కోట్ల అంచనా వ్యయంతో మొదలైన ప్రాజెక్టు చివరికి పనుల అంచనా వ్యయం రూ.52 వేల కోట్లకు పెరిగింది. తాజాగా మొదటి పంపును సిద్ధం చేయడంతో ప్రాజెక్ట్ కింద నీటి విడుదలకు రంగం సిద్ధమైంది.

వచ్చే ఎన్నికల్లో ప్రచారాస్త్రం ఇదే..!

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ కింద నీటిని విడుదల చేసి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా మలుచుకునేందుకు అధికార బీఆర్ఎస్ సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈనెల 16న నార్లాపూర్ పంప్‌హౌస్‌లోని ఇన్‌టేక్ వద్ద మొదటి మోటారు నీటి పంపింగ్‌ను సీఎం కేసీఆర్ ప్రారంభించిన అనంతరం కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అదేరోజు నార్లాపూర్ సమీపంలో భారీ బహిరంగసభ నిర్వహించనున్నారు. ఈ సభకు ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని గ్రామాల సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యేలా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. అదేవిధంగా ఈనెల 17న ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని అన్ని గ్రామాల ప్రజలు ఆలయాల్లోని దేవతా మూర్తులను కృష్ణా జలాలతో అభిషేకం చేసి మొక్కులు తీర్చుకోవాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని దక్షిణ తెలంగాణ వ్యాప్తంగా పండగలా నిర్వహించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో జలాశయాల వివరాలు..

రిజర్వాయర్	బండ్ పొడవు (కిలోమీటర్లు)	ఎఫ్ఆర్ఎల్ (మీటర్లు)	సామర్థ్యం (టీఎంసీ)	ఆయకట్టు (ఎకరాలు)
అంజనగిరి (నార్లాపూర్)	6.647	345.000	8.51	-
వీరాంజనేయ (ఏదుల)	7.716	445.000	5.91	-
వెంకటాద్రి (వట్టెం)	14.750	542.000	16.74	1,33,000
కురుమూర్తిరాయ (కర్వెన)	13.185	531.000	17.34	1,82,000
ఉదండాపూర్	15.875	629.000	16.03	5,02,000

స్టేజీల వారీగా ఎత్తిపోయనున్న మోటార్లు, వాటి సామర్థ్యం..

లిఫ్ట్	ఎత్తు (మీటర్లు)	మోటార్లు	ఒక్కొక్క మోటార్ ఎత్తిపోసే నీరు
నార్లాపూర్	104	9	85 క్యూసెక్కులు
ఏదుల	124	9	75 క్యూసెక్కులు
వట్టెం	121	9	75 క్యూసెక్కులు
ఉదండాపూర్	131	5	75 క్యూసెక్కులు

(ఒక్కో మోటార్ సామర్థ్యం 145 మెగావాట్లు)

పాలమూరు విద్యార్థులకు విదేశీ విద్య



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో ఇంటర్‌నేషనల్ ఎడ్యుకేషనల్ హబ్ ద్వారా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలతోపాటు యూనివర్సిటీలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు విదేశీ విద్య చదువుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన రాష్ట్ర సచివాలయంలోని తన చాంబర్‌లో ఎడ్యుకేషనల్ ఫెయిర్ నిర్వాహకులతో చర్చించారు. అమెరికా, కెనడా, లండన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల యూనివర్సిటీల్లో చదువుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఎడ్యుకేషనల్ ఫెయిర్‌లో విదేశీ యూనివర్సిటీల ద్వారా ఎంపికైన జిల్లాలోని పేద, మధ్య తరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఎడ్యుకేషనల్ లోన్‌లను వీసా ప్రాసెస్, ఎడ్యుకేషనల్ గైడ్ కోర్సుల కౌన్సిలింగ్‌లను కల్పించి దేశ విదేశాల్లో మహబూబ్‌నగర్ జిల్లా విద్యార్థులకు విదేశీ విద్యను అందించడానికి త్వరలో ఇంటర్‌నేషనల్ ఎడ్యుకేషనల్ ఫెయిర్ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు వినయ్‌కుమార్, అంకిత్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎస్సీ వర్గీకరణను ఎట్టి పరిస్థితుల్లో జరగనీయమని.. దాన్ని అడ్డుకుని తీరుతామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు పెద్దఎత్తున పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 19 నుంచి 22 వరకు ఢిల్లీలో ధర్నా కార్యక్రమం చేపడుతున్నామని, కార్యక్రమానికి పెద్దసంఖ్యలో మాలలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ధర్నా కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

1.25 లక్షల మంది రైతుల రుణమాఫీ



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వ్యవసాయ రుణాలకు సంబంధించి జిల్లాలో 1.25 లక్షల మంది రైతులకు చెందిన రూ.953 కోట్లు మాఫీ కానున్నాయని కలెక్టర్ రవినాయక్ తెలిపారు. పంట రుణాల మాఫీ, కొత్త రుణాల మంజూరుపై బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి బ్యాంకు, వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 55,250 మంది రైతులకు రూ.297 కోట్లు రుణమాఫీ అయిందని, ఈ మేరకు వారి బ్యాంకు ఖాతాలలో డబ్బులు జమ అయ్యాయని, మిగతా రైతుల రుణమాఫీ పురోగతిలో ఉన్నట్లు చెప్పారు. రుణ మాఫీ లబ్ధిపొందిన రైతులందరికీ రెన్యూవల్ చేయాలని, కొత్త రుణాలివ్వాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఎవరికైనా రుణమాఫీ కాలేదని, కొత్త రుణాల మంజూరు తదితర అంశాలపై ఏవైనా అనుమానాలు ఉంటే జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబర్ 08542-241165కు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించారు. రుణమాఫీ పొందిన రైతులు ఈ నెల 25 వరకు తప్పనిసరిగా రెన్యువల్ చేయాలని, అలాగే కొత్త రుణాలు ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో డీఏఓ వెంకటేష్, ఎల్‌డీఎం భాస్కర్, వివిధ బ్యాంకుల కంట్రోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సెక్టోరల్ అధికారులు ఎన్నికల విధులను అప్రమత్తంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవినాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు కేంద్రం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసే సూచనలను పాటించాలని, హ్యాండ్‌బుక్‌తోపాటు అన్ని కార్యక్రమాలకు సంబంధించి ఇచ్చే చెక్ లిస్ట్ కలిగి ఉండాలన్నారు. ఎన్నికలలో సెక్టోరల్ అధికారులు కీలకమని, ఎన్నికల సమయంలో మెజిస్టీరియల్ పవర్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ ప్రతి సెక్టార్‌కు ఒక సెక్టోరల్ అధికారిని నియమిస్తామన్నారు. సమావేశంలో జడ్చర్ల ఆర్‌డీఓ, అదనపు కలెక్టర్ మోహన్‌రావు, దేవరకద్ర ఆర్‌డీఓ నటరాజు, మహబూబ్‌నగర్ ఆర్డీఓ అనిల్‌కుమార్, జిల్లా రీసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటలపై ఆశలు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): ఖరీఫ్ పంటలపై ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలో 3,054,427 ఎకరాల్లో పత్తి, వరి, మొక్కజొన్న తదితర పంటలు సాగయ్యాయి. అయితే ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురవగా.. సాగు చేసిన ఆరుతడి పంటలు సరిగా ఎదగక రైతులు ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు పడగా.. మరో మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. అయితే బుధవారం వర్షం కురవకపోవడంతో నాలుగు రోజులుగా వర్షంతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు తేరుకుని తమ రోజువారి పనులను యథాక్రమంగా జరుపుకొన్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని మూసాపేట మండలంలో 32.5 మి.మీ., భూత్పూర్‌లో 30.2, మహబూబ్‌నగర్ రూరల్‌లో 31.4, అడ్డాకులలో 27.9, మహబూబ్‌నగర్ అర్బన్‌లో 26.5, నవాబుపేటలో 22.5, రాజాపూర్‌లో 23.1, బాలానగర్‌లో 21.5, హన్వాడలో 19.3, కొకుంట్లలో 18.3, గండేడ్‌లో 16.3, చిన్నచింతకుంటలో 14.9, జడ్చర్లలో 14.5, దేవరకద్రలో 12.0, మిడ్జిల్‌లో 11.3, కోయిలకొండలో 10.7, మహమ్మదాబాద్‌లో 8.6 చొప్పున వర్షపాతం నమోదైంది.

ఉల్లి ధరలు పైపైకి..

- క్వింటాల్ గరిష్టంగా రూ.2,800.. కనిష్టంగా రూ.1,700

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన ఉల్లి పాయల బహిరంగ వేలంలో ధరలు మరోసారి పెరిగాయి. గత నెల మొదటి వారం నుంచి కొద్దికొద్దిగా ఉల్లి ధరలు ఎగబాకుతున్నాయి. ఉల్లి సీజన్ అంతా రూ.వెయ్యిలోపే ఉన్న ధరలు ప్రతి వారం కొంత పెరుగుతుండగా.. ఈ వారం రూ.3 వేలకు చేరువయ్యాయి. మార్కెట్‌కు దాదాపు రూ.500 బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. గత సీజన్‌లో పండించిన ఉల్లి ఇప్పటికి కొందరు రైతులు నిల్వ చేసుకోవడం వల్ల మార్కెట్‌కు ప్రతివారం కొంత అమ్మకానికి వస్తుంది. సీజన్‌లో తక్కువ ధరలు రావడం వల్ల చాలామంది రైతులు ఉల్లిని పొలాల వద్ద నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం ధరలు బాగా వస్తుండడంతో ఉల్లిని అమ్మకానికి తెస్తున్నారు.

జోరుగా సాగిన వేలం..

మార్కెట్‌లో ఉల్లి వేలం పాటలు జోరుగా సాగాయి. నాణ్యతగా ఉన్న ఉల్లికి బాగా డిమాండ్ ఉండడంతో ఏకంగా క్వింటాల్ ధర గరిష్టంగా రూ.2,800ల వరకు పలికింది. రెండో రకం ఉల్లి కనిష్టంగా రూ.1,700 వరకు వచ్చింది. గత వారం గరిష్టంగా రూ.2,400, కనిష్టంగా రూ.1,600 వరకు ధరలు నమోదయ్యాయి. ప్రస్తుతం వచ్చిన ధరలతో పోల్చితే గరిష్టంగా రూ.400, కనిష్టంగా రూ.100 వరకు ధరలు పెరిగాయి. వేలం తర్వాత తూకం వేసిన 45 కిలోల ఉల్లి బస్తా గరిష్టంగా రూ.1,400, కనిష్టంగా రూ.850 వరకు విక్రయించారు. మార్కెట్‌లో వినియోగదారులతోపాటు చిన్న వ్యాపారులు ఎక్కువగా ఉల్లిని కొనుగోలు చేశారు. దేవరకద్ర సంతలో కిలో ఉల్లి రూ.30 వరకు విక్రయించారు.



ఎన్నికల నియమావళికి లోబడి పనిచేయాలి



మాట్లాడుతున్న ఎస్పీ కె.నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అందరూ ఎన్నికల సంఘం నియంత్రణ, పర్యవేక్షణ క్రమశిక్షణకు లోబడి పనిచేయాలని ఎస్పీ కె.నరసింహ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ అధికారులకు ఎస్పీ కార్యాలయంలో ఎన్నికల నియామావళి, భద్రత చర్యలు, అధికారుల పనితీరుపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు విధులు నిర్వహించాలని, జిల్లాలోని మూడు నియోజకవర్గాలు మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్రకు ఒక్కో డీఎస్పీ ఇన్‌చార్జ్‌గా ఉండి బందోబస్తు పర్యవేక్షిస్తారని చెప్పారు. ఎన్నికల ముందు, ఎన్నికల రోజు, కౌంటింగ్ ఇతర అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కలిగి పెంచుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రతి ఒక్క పోలీస్ అధికారి అప్రమత్తంగా, పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలపై పూర్తిగా పట్టు కలిగి ఉండాలని చెప్పారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా, ఇబ్బందులు సృష్టించే వారిని వెంటనే బైండోవర్ చేయాలన్నారు. గత ఎన్నికల్లో సమస్యలు సృష్టించిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని, సమస్యలు సృష్టించాలని ప్రయత్నం చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలను తరచుగా సందర్శించాలని సూచించారు. జిల్లా ఎన్నికల మేనేజ్‌మెంట్ ప్లాన్ ప్రకారం బందోబస్తు తయారు చేయాలని, పోలింగ్ రోజు పోలింగ్ స్టేషన్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని దీనికి కావాల్సిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఎస్పీ రాములు, డీఎస్పీలు రమణారెడ్డి, లక్ష్మణ్, సీఐలు, ఎస్ఐలు, ఎన్నికల సెల్ టీం, ఐటీకోర్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు





మహబూబ్‌నగర్‌లోని శ్రీమురళీకృష్ణ మందిరం, శ్రీకృష్ణ భగవానుడు

స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం పట్టణంలోని పలు ఆలయాల్లో ఘనంగా నిర్వహించనున్నారు. వేడుకల్లో భాగంగా పలుచోట్ల ఉట్ల వేడుకలు జరిపేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. కొన్ని ఆలయాల్లో రెండురోజులపాటు ఉత్సవాలు జరిపిస్తారు. రుక్మిణిపాండురంగస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. అలాగే జిల్లాకేంద్రంలోని పద్మావతికాలనీ శ్రీమురళీకృష్ణ మందిరంలో సుందర సత్సంగ్ ఆధ్వర్యంలో బుధవారం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఉదయం అభిషేకం, అలంకారం, అఖండ దీపారాధన, పుణ్యాహవచనం, మహా నైవేద్యం, మంగళహారతి నిర్వహిస్తారు. శ్రీకృష్ణ అష్టోత్తర నామావళి పారాయణం నిర్వహించడంతో పాటు అర్ధరాత్రి 12 గంటల అనంతరం శ్రీకృష్ణుని విగ్రహానికి ఉయ్యాల సేవ ఉంటుంది.

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

నవాబుపేట: కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని చౌడూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రమేష్ (40) జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో కూలీ పని చేస్తుండేవాడు. ఈయనకు పదేళ్ల క్రితం హైదరాబాద్ చెందిన లక్ష్మితో వివాహమైంది. కాగా తరుచూ భార్యాభర్తలు గొడవ పడుతుండేవారని పోలీసులు తెలిపారు. తాజాగా భార్యతో గొడవపడి రమేష్ చౌడూర్‌కు వచ్చి మనస్తాపంతో బుధవారం తెల్లవారుజామున ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా పురుగు మందు తాగాడు. అనంతరం తన తల్లి రాములమ్మను నిద్రలేపి తాను చనిపోతున్నట్లు చెప్పటంతో ఆమె వెంటనే కుటుంబ సభ్యులను నిద్రలేపి అపస్మారక స్థితిలో ఉన్న రమేష్‌ను ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయమించటంతో అతన్ని హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మండల తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించే కొండాపూర్ చెందిన సాయిలు మంగళవారం ద్విచక్ర వాహనంపై వస్తుండగా అదే గ్రామానికి చెందిన రాఘవేందర్ మద్యం మత్తులో బైక్‌పై వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సాయిలు కిందపడి కాలు విరిగిపోయింది. బుధవారం బాధితుడి భార్య సరస్వతి ఫిర్యాదుతో కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కిందపడి వృద్ధుడు మృతి

తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన గుందూరు పెద్ద తిరుపతయ్య(62) బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తూ అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. స్థానికులు పరిశీలించగా అక్కడికక్కడే మృతి చెందాడు.

విధులు నిర్వర్తించిన చోటే.. విధి రాతకు బలి


వెంకటయ్య (ఫైల్)

దేవరకద్ర రూరల్: విధులు నిర్వర్తించిన చోటే.. గుర్తు తెలియని రైలు ఢీకొని అదే స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న గేట్‌మన్ మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి కౌకుంట్ల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కౌకుంట్ల మండలం పుట్టపల్లికి చెందిన ఎరుకలి వెంకటయ్య (57) పుట్టపల్లి వద్ద రైల్వే గేట్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి బహిర్భూమికని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని రైల్వేగేట్ దగ్గర గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలిసులు మృతదేహన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

హన్వాడ: మానసిక పరిస్థితి బాగోలేక కలుపు మందు తాగిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని లింగన్నపల్లికి చెందిన మైబమ్మ(49) భర్త ఏడాదిన్నర క్రితం మృతిచెందాడు. దీంతో కలత చెందిన ఆమె కొన్నిరోజులుగా పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తుండేది. ఈ క్రమంలోనే గత నెల 11న ఇంట్లో ఉన్న కలుపు మందు తాగి అపస్మారక స్థితికి చేరగా.. గమనించిన చుట్టుపక్కల వారు జనరల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఉస్మానియాకు తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందినట్లు ఎస్ఐ రవినాయక్ తెలిపారు. ఈ విషయమై మైబమ్మ కొడుకు మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. అయితే మైబమ్మ కల్లు తాగడం మానేసే ప్రయత్నంలో పిచ్చిగా ప్రవర్తించి కలుపు మందు తాగి మృతిచెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

పెద్దరేవల్లిలో యువకుడు..

బాలానగర్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పెద్దరేవల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జంగ యాదయ్య (32) కుటుంబ కలహాలతో ఈ నెల 4వ తేదీన పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆటోలో మరిచిన బంగారం తిరిగి అప్పగింత

మహబూబ్‌నగర్ క్రైం: తెలకపల్లి మండలం ఆలేరుకు చెందిన శ్రీనివాసాచారి బుధవారం కుటుంబంతో సహ పట్టణంలోని పద్మావతి కాలనీలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం షాపింగ్ కోసం కుటుంబ సభ్యులతో కలిసి పాన్ చౌరస్తాకు ఆటోలో వచ్చాడు. బ్యాగ్‌ను ఆటోలో మరిచి పోయారు. బాధితుడు విషయాన్ని వన్‌టౌన్ సీఐ సైదులు దృష్టికి రాగానే పోలీస్ సిబ్బంది అప్రమత్తం చేసి సీసీ కెమెరాలు పరిశీలించి 3 తులాల బంగారం బాధితుడికి అప్పగించారు.

బుసలు కొడుతున్న గంజాయి

- విద్యార్థులు, యువకులే లక్ష్యం
- పాలమూరులో వైద్యులు సైతం బాధితులే
- జిల్లా కేంద్రంలో జోరుగా వాడకం


మహబూబ్‌నగర్‌లో పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: హైదరాబాద్ నుంచి భారీ స్థాయిలో ఎండు గంజాయి పాలమూరు పట్టణం మీదుగా వెళ్తుంటే ఈనెల 2న నార్కొటిక్స్ అధికారులు సీజ్ చేశారు. ఇందులో కొంత భాగంగా పాలమూరు, కర్ణాటకకు ప్రాంతానికి తరలించడానికి రవాణా చేసినట్లు సమాచారం. డీలర్లు విద్యార్థులు, యువకులను లక్ష్యంగా చేసుకుని గంజాయిని జిల్లా సరిహద్దులను దాటి పట్టణానికి చేర్చుతున్నారు. హైదరాబాద్, వైజాగ్ ఏజెన్సీ కేంద్రంగా పెంచుతున్న గంజాయి జాతీయ రహదారి మీదుగా జిల్లాకు వస్తోంది. ఎక్సైజ్, పోలీసులు కట్టడికి చర్యలు చేపట్టిన కూడా పట్టణంలో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

❐ జనవరి నుంచి ఆగస్టు వరకు ఎక్సైజ్ పరిధిలో 3 గంజాయి కేసులు నమోదు కాగా ఏడుగురిని అరెస్ట్ చేశారు. ఇందులో 2కేజీల100గ్రాముల ఎండు గంజాయి, ఒక వాహనం స్వాధీనం చేసుకున్నారు.

ఆటోలో అమ్మకాలు

జిల్లా కేంద్రంలో ఒకరిద్దరూ డీలర్స్ హైదరాబాద్‌లో ఎక్కువ మొత్తంలో గంజాయి విక్రయించి పట్టణంలో ఆటోలో తిరుగుతూ ప్యాకెట్ల రూపంలో క్లాక్‌టవర్, బండమీదిపల్లి, షాషాబ్‌గుట్ట, బస్టాండ్, కొత్తచెరువు ప్రాంతాల్లో విక్రయాలు సాగిస్తున్నట్లు తెలిసింది. ముఖ్యంగా రాత్రివేళలో నడిచే కొన్ని క్రీడా సెంటర్లలో యువకులు గంజాయి దర్జాగా పీలుస్తున్నట్లు సమాచారం.

బానిస కావాల్సిందే..

మత్తు పదార్థాలకు మనిషి అలవాటుపడితే వాటి నుంచి దూరం కావడం అసాధ్యం. కేవలం మత్తును ఆస్వాదించడం కోసం వినియోగించే డ్రగ్స్‌ను ఆస్పత్రులలో శస్త్రచికిత్సలు చేసే సమయంలో రోగులకు నొప్పి తగ్గడానికి వైద్యులు అవసరమైన మోతదులో ఇస్తుంటారు. ఇలాంటి డ్రగ్స్‌ను అవసరమైన దానికంటే ఎక్కువగా ఉపయోగిస్తే మనిషిపై తీవ్ర ప్రభావం చూపించడంతో పాటు నిత్యం కావాలనిపిస్తుంది.

కట్టడికి టీం ఏర్పాటు చేశాం



పాలమూరులో గంజాయి కట్టడి కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్, మహబూబ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బందిని కలిపి టీం ఏర్పాటు చేశాం. ఈ టీం నిరంతరం గంజాయిపై తనిఖీ చేస్తుంది. పట్టణంలో గంజాయికి సంబంధించి 13మందిని బైండోవర్ చేసి రూ.2లక్షల చొప్పున జరిమానా విధించగా, ఇందులో ఒకరు రూ.2లక్షలు చెల్లించకపోవడంతో జైలులో ఉన్నాడు. పట్టణంలో గంజాయి విక్రయాలు లేకుండా చర్యలు చేపడుతున్నాం.

–సైదులు, ఈఎస్, మహబూబ్‌నగర్

ఒక్కో పాకెట్ రూ.200 నుంచి రూ.300


సీజ్‌చేసిన గంజాయి(ఫైల్)

పట్టణంలో ఒక్కో పాకెట్ 12గ్రాములు నింపి రూ.200నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు. దీనిని యువకులు సిగరెట్‌లో ఉండే పొగాకులో గంజాయి కలిపి పీలుస్తున్నారు. కేవలం 17నుంచి 28ఏళ్ల మధ్య ఉన్న వారితో పాటు ఆటోలు నడుపుతున్న కొందరు యువకులు దీనిని అధికంగా తీసుకుంటున్నారు. ప్రధానంగా పట్టణంలో చెలామణిలో ఉన్న కొందరు వైద్యులు సైతం గంజాయి తీసుంటున్నట్లు సమాచారం.

విక్రయదారులు నాణ్యత పాటించాలి


కురుమూర్తి స్వామి ఆలయం వద్ద వేలం నిర్వహిస్తున్న అధికారులు

- ఈఓ మదనేశ్వర్‌రెడ్డి
- కురుమూర్తిస్వామి ఆలయం వద్ద పలు వస్తువుల విక్రయాలకు వేలం

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు, జాతరను పురస్కరించుకుని ఆలయం వద్ద వివిధ రకాల వస్తువులను విక్రయించేవారు తప్పనిసరిగా నాణ్యత పాటించాలని ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. 2023–24కు గాను బుధవారం ఆలయం వద్ద వేలం నిర్వహించారు. ఈ వేలంలో కొబ్బరికాయలు విక్రయించేందుకు రూ.53.10లక్షలకు కోయిల్‌కొండకు హరుణ్ కుమార్ దక్కించుకున్నారు. లడ్డు ప్రసాదం విక్రయానికి రూ.42.95లక్షలకు కొత్తకోటకు చెందిన శ్రీనివాస్ శెట్టి, కొబ్బరి చిప్పల సేకరణకు రూ.3.95లక్షలకు అల్లీపురం చెందిన పెద్ద ఆంజనేయులు, లైట్ల ఏర్పాటుకు రూ.8.95లక్షలకు అమ్మాపురం చెందిన శ్రీకాంత్ దక్కించుకున్నారు. ఈ వేలం ద్వారా ఆలయానికి రూ.1,80,95,000 ఆదాయం సమకూరింది. టెండర్‌దారులు తప్పనిసరిగా ఈనెల 11వ తేదీ వరకు మొత్తం డబ్బులు చెల్లించాలని, లేకుంటే టెండర్ రద్దు చేసి డిపాజిట్ చేసిన డబ్బులు తిరిగి చెల్లించబడని ఆలయ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది శ్రీకర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

తలనీలాలు, పూజాసామగ్రి వేలం వాయిదా

తలనీలాలు, పూజాసామగ్రి వేలం కేవలం బ్రహ్మోత్సవాలు, జాతరకు కలిపి నెల రోజుల మాత్రం వరకు సమయం ఇస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. కాగా వేలంలో పాల్గొన్న టెండర్‌దారులు మాత్రం సంవత్సరం పొడవునా వాటికి సమయం కేటాయించాలని పట్టుబట్టారు. దీంతో అధికారులు చేసేది లేక వీటి వేలం వాయిదా వేశారు. తిరిగి రెండు రోజుల్లో దీనిపై ప్రకటన చేస్తామని ఆలయ అధికారులు వెల్లడించారు.

డ్రగ్స్ నిల్వ కేసులో ఆర్‌ఎంపీకి జరిమానా

పాలమూరు: ఎలాంటి లైసెన్స్ లేకుండా డ్రగ్స్ నిల్వ చేసిన ఆర్‌ఎంపీకి ఒక రోజు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. మహబూబ్‌నగర్ మండలంలోని రామచంద్రాపూర్‌లో ఆర్‌ఎంపీ శెట్టి బసప్ప ఎలాంటి లైసెన్స్ లేకుండా పలు రకాల డ్రగ్స్ నిల్వ పెట్టడంతో 2016లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దినేష్‌కుమార్ వాటిని స్వాధీనం చేసుకుని, విచారణ అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు బుధవారం జిల్లా సెషన్స్ కోర్టుకు రావడంతో విచారించిన న్యాయమూర్తి శెట్టి బసప్పకు ఒక రోజు జైలు శిక్ష, రూ.35వేల జరిమాన విధిస్తూ తీర్పు ఇచ్చారు.

నర్సప్ప ఆలయంలో చోరీ



అయిజ: పట్టణంలోని నరసింహకాలనీలోని నర్సప్ప స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. స్వామి వెండి విగ్రహం, నాగుపాము ఆకారంలో తయారు చేసిన పంచలోహపు విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. విగ్రహాల విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలుపట్టాలపై కూలిపడిన మట్టి

- మినుగోనిపల్లి శివారులో ఆగిన గూడ్స్‌రైలు


మినుగోనిపల్లి వద్ద మునీరాబాద్ లైన్‌పై కూలిన మట్టిని తొలగిస్తున్న కూలీలు

దేవరకద్ర: మండలంలోని మీనుగోపల్లి శివారులో మునిరాబాద్‌లైన్‌లో ట్రాక్‌పై మట్టి కూలడంతో గూడ్స్ రైలు నిలిచిపోయింది. వివరాల్లోకి వెళితే.. దేవరకద్ర నుంచి కృష్ణ రైల్వేస్టేషన్ వరకు ఉన్న మునీరాబాద్ లైన్ ప్రస్తుతం గూడ్స్ రైళ్లను నడుపుతున్నారు. ఈ క్రమంలో మినుగోనిపల్లి శివారులో అమ్మాపూర్ రోడ్డు కింద అండర్ ట్రాక్ వేశారు. ఇక్కడ రెండు వైపుల వర్షం నీరు పోవడానికి నిర్మించిన కాల్వలు నాణ్యత లేకపోవడంతో పైనుంచి మట్టి కూలి ట్రాక్‌పై పడింది. దీంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కృష్ణ నుంచి వచ్చిన గూడ్స్ రైలు నిలిచిపోయింది. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు వెంటనే జిల్లా కేంద్రం నుంచి సిబ్బంది పంపించి తక్షణం పనులు ప్రారంభించి ట్రాక్‌పై ఉన్న మట్టిని తొలగించారు. ట్రాక్‌ను క్లియర్ చేయడంతో గూడ్స్ రైలు వెళ్లిపోయింది.

మునిరాబాద్ లైన్ పరిశీలించిన డీఆర్‌ఎం

దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎంగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న లోకేష్ వైష్ణోయ్ బుధవారం ప్రత్యేక రైలులో దేవరకద్ర రైల్వేస్టేషన్ చేరుకుని, అక్కడి నుంచి మునిరాబాద్ లైన్‌లో ప్రయాణించారు. దేవరకద్ర నుంచి కృష్ణ వరకు ఉన్న రైల్వే లైన్‌ను పరిశీలించడానికి వెళ్తుండగా మినుగోనిపల్లి వద్ద మట్టి కూలిన ప్రాంతం వద్ద కొద్ది సేపు ఆగారు. ఈ సందర్భంగా మట్టి కూలడంపై ఆరా తీశారు. మరమ్మతులు పూర్తి స్థాయిలో చేపట్టి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. అలాగే ఈ లైన్‌లో చేపడుతున్న విద్యుత్ లైన్ పనులను ఆయన పరిశీలించారు.

లింకు నొక్కగానే డబ్బులు కొట్టేశారు!

పెబ్బేరు రూరల్: గుర్తు తెలియని లింకును నొక్కగానే ఖాతాలోంచి డబ్బులు మాయమైన ఘటన వనపర్తి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జంగిడిపురంకాలనీకి చెందిన దేవేంద్రం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వరిస్తున్నాడు. ఈయన మొబైల్‌ఫోన్‌కు ఆగస్టు 8వ తేదీన పాన్‌కార్డును అప్‌డేట్ చేసుకోవాలని ఓ లింకు మెసేజ్ వచ్చింది. అదే రోజు రాత్రి స్నేహితుడికి ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపాలని ప్రయత్నిస్తే టెక్నికల్ ప్రాబ్లం అని వచ్చింది. నిజంగానే పాన్‌కార్డు అప్‌డేట్ చేసుకోవాలని అనుకుని ఆ లింకును నొక్కాడు. తనకు వచ్చిన ఓటీపీని వెంటనే అందులో ఎంటర్ చేయగా రూ.25 వేలు ఖాతా నుంచి కట్ అయ్యాయి. మోసపోయినట్లు గుర్తించి బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పది యూనిట్లలో విద్యుదుత్పత్తి


జూరాల నుంచి జెన్‌కో జల విద్యుత్ కేంద్రానికి వెళ్తున్న నీరు

ధరూరు/ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి భారీగా ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రం 7 గంటల వరకు 38,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఆవిరి రూపంలో 46, ఎడమ కాల్వకు 640 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి 40,676 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.969 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా ప్రస్తుతం 123.50 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 784 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ప్రాజెక్టు నుంచి 12,908 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 29.80 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 21,667 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 5,075 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

దిగువ, ఎగువ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేపడుతున్నారు. బుధవారం 10 యూనిట్ల ద్వారా 395 మెగావాట్లు, 146.747 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువ కర్ణాటక రాష్ట్రంలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల నుంచి వరద చేరుతుండడంతో ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 7.819 ఎం.యూ., దిగువలో 5 యూనిట్ల ద్వారా 200 మెగావాట్లు, 75.928 ఎం.యూ. విద్యుదుత్పత్తిని చేపడుతున్నామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 146.747 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించినట్లు పేర్కొన్నారు.

రామన్‌పాడుకు నీరు నిలిపివేత

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 450 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేజ్–2 ద్వారా 72, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

కోయిల్‌సాగర్‌లో 30 అడుగులు..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ నీటి మట్టం పెరుగుతూ పూర్తి స్థాయికి చేరువవుతుంది. బుధవారం సాయంత్రం వరకు ప్రాజెక్టు నీటి మట్టం 30 అడుగులకు చేరింది. మంగళవారం సాయంత్రం వరకు 29 అడుగులు ఉన్న నీటి మట్టం ఒక అడుగు పెరిగింది. బుధవారం నుంచి జూరాల నీటి విడుదలను నిలిపి వేశారు. నాలుగు రోజుల నుంచి కుడి, ఎడమ కాల్వలను మూసివేశారు. ప్రస్తుతం పెద్దవాగు ద్వారా ప్రాజెక్టులోకి వరద వస్తుంది. పూర్తిస్థాయి నీటి మట్టం 32.6 అడుగులు కాగా, మరో 2.6 అడుగుల నీరు చేరితే గేట్లను తెరిచే అవకాశం ఉంది.

శ్రీశైలంలో 851.2 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం 851.2 అడుగుల వద్ద 82.7 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 39,990 క్యూసెక్కుల నీటిని శ్రీశైలంకు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 1,500, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,315, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. స్థానికంగా 14.80 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

గొప్ప మేధావి అంబేడ్కర్


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ మందజగన్నాథం, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

గద్వాల అర్బన్: ప్రపంచ దేశాల్లోనే అత్యంత గొప్ప మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మంద జగన్నాథం అన్నారు. జిల్లా కేంద్రంలోని గంజిపేటకాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా విగ్రహానికి పూలమాల వేశారు. వారు మాట్లాడుతూ దేశ ప్రజల లౌకిక, సామాజిక, సమానత్వం, హక్కులు, రిజర్వేషన్లు, కులమతాల బేధం లేకుండా పాలించుకోవడానికి రాజ్యాంగం రచించారన్నారు. పదేళ్లయితేనే రిజర్వేషన్లు తొలగిస్తామని చెబితే, ఆనాడు బాబు జగ్జీవన్‌రాం కేంద్ర కెబినేట్‌లో ఉంటూ అంటరాని తనం పోలేదని, ఉపాధి, పేదరికం తగ్గలేదని పోరాటం చేసి, నిరంతరం రిజర్వేషన్లు కొనసాగించేలా చేశారన్నారు. అంతకుముందు విగ్రహ ఏర్పాటుకు సహకరించిన వారిని సన్మానించారు. అనంతరం వివిధ సంఘాలు, పార్టీల నాయకులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సరిహద్దుల్లో పటిష్ట బందోబస్తు

- కర్ణాటక, తెలంగాణ పోలీసుల సమీక్ష


సరిహద్దు పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న నారాయణపేట డీఎస్పీ సత్యనారాయణ

కృష్ణా: రాష్ట్రంలో త్వరలో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సరిహద్దు ప్రాంతాల్లో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని నారాయణపేట డీఎస్పీ సత్యనారాయణ సూచించారు. బుధవారం మండలంలోని హిందుపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కర్ణాటకలోని కల్‌బుర్గి, యాద్గీర్, రాయచూర్ జిల్లాల పోలీస్ అధికారులతో ఎస్పీ ఆదేశాల మేరకు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో సరిహద్దులో డబ్బులు, మద్యం తరలించకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాలు గంజాయి, డ్రగ్స్ వంటివి సరిహద్దుల గుండా సరఫరా కాకుండా అడ్డుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, చోరీలు, మిస్సింగ్ కేసుల విషయంలో సరిహద్దులోని పోలీసులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఆయా జిల్లాల పోలీస్ అధికారులతో పాటు సీఐ రాంలాల్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టపై మొసలి సంచారం


ఆత్మకూర్ చెరువుకట్టపై మొసలి

ఆత్మకూర్: పట్టణంలోని పరమేశ్వరస్వామి చెరువు కట్టపై మొసలి సంచారంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రతి రోజు మధ్య రాత్రి వేళ చెరువు కట్టపై రోడ్డుకు అడ్డంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. మొసలి ఫొటోలను వాహనదారులు సామాజిక మధ్యమాల్లో పెట్టడంతో విషయం బయటకు తెలిసింది. ఫారెస్ట్ అధికారులు స్పందించి మొసలిని పట్టుకుని తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

నెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక


నెట్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టుతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

జడ్చర్ల టౌన్: నిర్మల్‌లో ఈ నెల 9నుంచి నిర్వహించనున్న రాష్ట్ర 6వ సీనియర్ నెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు బుధవారం ఎంపిక చేసినట్లు నాగసాల వద్ద ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల బాలుర ప్రిన్సిపాల్ పారిజాత తెలిపారు. జట్టులో పట్టణానికి చెందిన శివ, ఏతేశామ్, అల్తాఫ్, షోయబ్‌లు ఉన్నారని వివరించారు. మహబూబ్‌నగర్ నుంచి నవీన్, మాసుమ్‌బాబ, వనపర్తి జిల్లా నుంచి వెంకటేష్, జాఫర్, గద్వాల జిల్లా నుంచి దినేష్, లోకేష్, నారాయణపేట జిల్లా నుంచి ఫర్హాన్, సయ్యద్ మోయిజ్ ఉన్నారని వివరించారు.

గోడకూలి యువకుడు దుర్మరణం

- మరొకరి పరిస్థితి విషయం
- పోలేపల్లి సెజ్‌లో ఘటన


కూలిన గోడను పరిశీలిస్తున్న పోలీసులు

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లి సెజ్‌లో ఓ ఫార్మా పరిశ్రమలో భవనం కూల్చివేత పనులలో ప్రమాదవశాత్తు గోడ కూలిన ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. సీఐ రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం గోకుల్‌నగర్‌కు చెందిన హరిజన్ మహిపాల్(19) పోలేపల్లి సెజ్‌లోని కార్తికేయ ఫార్మా పరిశ్రమలో గోడ కూలి మృతిచెందగా, అదే గ్రామానికి చెందిన మరో కూలీ భీమేష్(21) తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా భీమేష్ పరిస్థితి విషమంగా ఉంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కూలీ పనులకు వచ్చి మృత్యువాత

పొట్టకూటి కోసం సుదూరంగా ఉన్న నారాయణపేట జిల్లా మద్దూర్ మండలం గోకుల్‌నగర్ నుంచి పోలేపల్లి సెజ్‌లోని ఫార్మా పరిశ్రమలో కూలీ పనులు చేసేందుకు వచ్చి ప్రమాదబారిన పడ్డారు. వీరిని మేస్త్రీ వెంకటయ్య పరిశ్రమలో కూలీ పనులకు కుదిర్చినట్లు పోలీసులు తెలిపారు. పరిశ్రమలో గోడను కూల్చే పనులు కూలీలకు అప్పగించారు. అయితే పనులు చేస్తున్న కూలీలపై గోడ కూలడంతో ఇరువురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం ఏనుగొండ ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మహిపాల్ మృతి చెందాడు. భీమేష్ పరిస్థితి విషమంగా మారింది. వీరు ఏడాదిన్నర కాలంగా ఇక్కడ కూలీలుగా పనులు చేస్తున్నట్లు సమాచారం.

తల్లిదండ్రులకు ఒక్కడే

మృతి చెందిన మహిపాల్ తల్లిదండ్రులు లక్ష్మమ్మ, వెంకటయ్యలకు ఒక్కగానొక్క కుమారుడు. కుమారుడి కూలి పైనే తమ జీవనోపాధి కొనసాగుతుందని, తమ ఒక్కగానొక్క కుమారుడు తమను విడిచి వెళ్లాడని వారు కన్నీరు మున్నీరయ్యారు.